కథానిక:

# తలపుల్లో మలుపులు

రచన: లంక వెంకటరమణ

రెండవ ఆట ముగిసింది
సుమారుగా ఒంటిగంట దాటింది
నిరాశవంటి చీకటి
ఆశల్లాంటి దీపాలు అక్కడక్కడా.

సరైన సవారీ కుదరలేదు. జేబు తడిమి చూసుకుంటే రూపాయి పూర్తికాలేదు. ముప్ఫయ్యో తేదికి లల్లూరాం శేఠ్‌కు వంద రూపాయలు కట్టాలి. సంపాదన ఎంత? ఖర్చు ఎంత? ఆలోచించలేడు అసలు ఆలోచించకూడదు. అది కూడని పని. ఎంత బలహీనతనన్నా తెస్తుంది ఆలోచన అన్నది

కమల్ టాకీస్‌లో మంచి పిక్చర్. రష్ బాగా వుందట! బాగానే గిట్టవచ్చు కిరాయి. మనస్సుకు పనిచెప్పేకన్న శరీరానికి పని చెప్పడం ఉత్తమం. చీకటి– చిరు చలిగాలి, బ్రిడ్జి దాటుతున్నాడు. మోతచేసుకుంటూ ష్లిమత్ ఎదురు వస్తున్నది. ఆలోచనలకు అంతరాయం. ఊహల్లోంచి యథార్థత లోకి జారి పడ్డాడు. వంతెన దాటాడు.

"మరి ఇక ముందుకు పోకూడదు"– ఏదో అంతర్గతశక్తి ఆదేశం. అవును – పోకూడదు. హద్దు దాటితే – ఏమైనా జరుగవచ్చు.

చెట్టు క్రింద రిక్షా ఆపాడు. కోటు జేబు లోంచి బీడీ తీసి వెలిగించాడు.

'ఎంతకాలం యిలా బ్రతకాలి?'

'ఈ కష్టాలకు అంతు ఎక్కడ?'

'జీవితంలో సుఖం ఉన్నదా.

ఈ ప్రశ్నలు తనకు క్రొత్తవి కావు. సమాధానాలు దొరకవు.

కసిగా బీడీ నేలకేసి కొట్టాడు.

ఎవరో యిద్దరు వస్తున్నారు – రెండు రిక్షాలకు సరిపడే సవారీ.

'ఛత్తేక్యా!' బొంగురు గొంతు.

'జీ!'

'దోసవారీ – మొజం జాహి మార్కెట్టు'– గుండె కలుక్కుమంది రిక్షావాడికి.

'క్యా దేనా'

గట్టిగా శ్వాస వదలిన చప్పుడు.

'మాఫ్ కీజియే సాబ్–'

రానన్న నిర్ణయం ధ్వనించింది రిక్షావాలా మాటల్లో–!

శరీరాలను మోసుకుంటూ వెళ్ళిపోయారు డబుల్ డెక్ బస్సుల్లాటి యిద్దరూ–!

'ఛీ! ఇది రెండోబేరం ఆ సైడుకు' — బాధగాను అనేశాడు సైకి,

సమాధాన పరచు కోవలసింది
మనస్సు తో–
త్వరగా సమాధాన పడనిదే మనసు.

ఆలోచనల వలయంలో పడకూడదు అది. పడితే తిరిగి స్వస్థతకు రాదు త్వరగా.

'రిక్షా వస్తావా?'

స్వచ్ఛమైన తెలుగు గొంతు. ప్రపంచం తను ఉండాలన్నట్లు ఉండనియ్యదుగా–!

'ఆఁ! ఎందాకా అమ్మా?'

'ఒక సవారి బరకత్‌పురా – యువతీ మండలి, రెండోది ఆంధ్రమహిళా సభ.'

కుదిరితే మంచి బేరమే – రూపాయకు తక్కువ గిట్టదు.

'ఏం ఇయ్యమంటావు?' ప్రశ్న కూడా వాళ్ళదే.

ఆలోచనలో పడ్డాడు– అలవాటే గా–!

'పదణాలు–'

తానేమన్నాడో గుర్తుకు తెచ్చుకున్నాడు. మరీ చచ్చుగా అనేశాడు. ఏమిటి ఈ బలహీనత? రిక్షా ఎక్కేవాడుగా మాట్లాడితే ఎట్లా తొక్కేవాడు.

'అర్ధరూపాయిస్తా–' బేరంలోకి దిగారు'

అతని హృదయం ఊడకపెడుతున్న గుడ్డు అయిపోయింది. ఏమీ అనలేకపోయాడు. రిక్షా త్రొక్కేవాళ్ళ బలహీనతలు అందరకూ తెలుసు. అందుకే బేరాలాడతారు. అణా తగ్గినా ఆదానే అన్నభావం పెరుగుతుంది రిక్షాను పిలవగానే–!

'మరీ అంత ......' త్రొక్కేసుకున్న బాధతో గొణిగాడు.

మారు మాట్లాడకుండా యిద్దరు ఎక్కారు రిక్షా.

తలకు గుడ్డ బిగించాడు.

వళ్ళంతా కోటుతో కప్పేసుకున్నాడు. విపరీతమైన చలి పరదా కట్టాడు రిక్షాకు. బీడీ ముట్టించాడు.

రిక్షా జోరుగా జారిపోతున్నది రోడ్డునుంచి

'మా పరిచయం ఆ విధంగా అభివృద్ధి అయింది......'

రిక్షా ఎక్కిన యిద్దరు యువతుల్లో ఒక గొంతు.

'బెటర్ స్పీక్ యిన్ యింగ్లిష్–' వాళ్ళ సంభాషణ అతను వినడానికి అయిష్టతను వ్యక్తపరుస్తూ అన్నది రెండో యువతి.

'డోన్ట్ మైండ్ దట్ ఫెలో–' వాడి లెఖ్ఖ ఏమిటి? పర్వాలేదులే అన్నభావం ఉన్నది ఆమె మాటల్లో.

'......అందరికి అనుమానాలు పెరిగాయి నిజానికి స్నేహానికి మించి మరేభావం లేదు. లేనిది ఆరోపించింది లోకం లోకం అంటే మరేం లేదు నన్ను మినహాయించగా మిగిలింది అంతా...

లోకమే! నావాళ్ళే నన్ను అవమానించారు, అయినా ఎవరినీ లెఖ్ఖచెయ్యలేదు, ఆయన చేరువలో అదో ఆనందం ఉండేది. ఏదో మరపించే మత్తు ఉండేది. ఆ మాటల్లో!

(తరువాయి 18 వ పేజీ)

# తలపుల్లో మలుపులు

(7 వ పేజీ తరువాయి)

ఒక్కరోజు రాకపోతే కాలేజీ అంతా శూన్యం అనిపించేది'

'ఒక రోజు కాలేజికి రాలేదు. చాలా అసంతృప్తి అనిపించింది. నాలుగున్నరకే కాలేజి వదిలా. ఆయన యింటికి పోదామనిపించింది. అనిపించడమే ఆలస్యంగా వెళ్లాను. ఎవరైనా ఏమన్నా అనుకుంటారన్న జంకు కలుగలేదు. గడపలోకి కాలు పెట్టగానే ఇరవై ఏళ్ళ యువతి ఎదురైంది.

'మా అన్నయ్య కోసమా?' అన్నది.

ఎందుకో అదోవిధమైన భీతి కలిగింది నాలో-!

'అవునండీ-!' అన్నాను ఎలాగో-!

'కూర్చోండి-' అంటూనే లోపలకు వెళ్ళింది

మనస్సు పరి పరి విధాల పోయింది. నేనెందుకు అక్కడకు వెళ్ళానో నిజానికి నాకే తెలియలా- ఏ ప్రభావం నన్ను అక్కడకు తీసుకుపోయిందో ఊహించుకోలేక పోయాను. నా రాకకు కారణం అడిగినా చెప్పలేని స్థితి అది.

'అన్నయ్య ఊళ్ళో లేరు రేపో ఎల్లుండో వస్తారు-' అన్నది మంచినీళ్ళ గ్లాసు అందిస్తూ.

యథార్థానికి నేను వెళ్ళిన పని అప్పటికే అయిపోయింది. అయినా ఎందుకో అక్కడే మరికొంత సేపు గడుపుదామనిపించింది! మనకు ఆప్తులైన వాళ్ళ చేరువలో ఉండడం అదో ఆనందం. మన ఆప్తులయొక్క ఆప్తులు మనకూ ఆప్తులే! అందుకే ఆ యింట్లో అదో విచిత్రమైన ఆనందం అనుభవించా!

'అన్నయ్య ఎందుకు ఊరు వెళ్ళారో మీకు తెలియదుకదూ!' చాలా నాజూకుగా నవ్వుతూ అన్నది.

'తెలియదు' అన్నాను నిజంగానే తెలియదు. తెలిస్తే పోయేదాన్ని కానుగా.

'మాకు ఒక వదినను తెచ్చిపెట్టేటందుకు వెళ్ళాడు-' ముసిముసిగా నవ్వుతూ అన్నది.

ఆశ్చర్యం కలిగింది ఎందుకో

ఎందుకో వింత అనిపించింది.

అయినా ఆనందం కలిగించింది. అవును- అంతకన్న అప్పటికే కలిగే అనుభూతి ఏమున్నది కనుక!

'గుడ్- హాపీన్యూస్' అన్నాను ఆవిడ ఆనందంలో పాలు పంచుకుంటూ

అయితే ఇక్కడే చిత్రం అరుణా! ఆవిడలో కలిగే పరిణామాలు ఊహించలేక పోయాను ఆవిడ వేసిన ప్రశ్న మాత్రం చాలా విస్మయాన్ని కలిగించింది.

'ఒక్క ప్రశ్న వేస్తాను. సూటిగా సమాధానం యిస్తారూ!'

ప్రశ్న విందామన్న కుతూహలం కలిగింది.

'అడగండి సమాధానం చెప్పడమేముంది' అన్నాను.

'మా అన్నయ్య మరో యువతిని పెండ్లాడబోతున్నాడంటే మీకు బాధ కలగడంలేదూ!'

ఎందుకో పొడినవ్వు గుండెల్లోనే కరిగిపోయింది.

'ఆయన వివాహం చేసుకోబోతుంటే నాకెందుకు బాధ? నిజం చెప్పనా - చాలా సంతోషంగా వుంది' అన్నాను నిర్లిప్తంగా.

'అయితే మే మనుకునేదంతా...' చకితురాలైంది నే నన్న మాటకు.

'మీ రేమనుకుంటున్నారో తెలీదు. అయినా ఊహించగలను. కాని మా యిద్దరి మధ్యా స్నేహానికి మించి మరేమి లేదు. నమ్మండి నమ్మకపోండి నిజం అది' అంటూనే వెళ్ళిపోయాను. అంత ధైర్యంగా ఎట్లా మాట్లాడానో తలుసుకుంటే ఆశ్చర్యం కలుగుతుంది యిప్పటికీను.

మరునాడు కాలేజీలో కనిపించారు. ఒక మూల మనస్సులో ఏదో కెమికల్ రియాక్షన్ ఉన్నది. అయినా ఏదో నిండుతనం అనిపించింది ఆయనను చూడగానే

'సాయంత్రం మిమ్మల్ని ఎక్కడ కలుసుకోగలను?' అడిగారు వంటరిగా చూచి

'మా యింటికి రావచ్చును'

తటపటాయించారు.

'ఎవ్వరూ లేరు. నిస్సంకోచంగా రావచ్చును'

అనుకున్న సాయంత్రం నిముషాలమీదనే దొర్లుకు వచ్చింది. మనస్సంతా అవ్యక్తమైన ఉత్సాహంతో నిండిపోయింది.

'నిన్న ఊరు వెళ్ళాను' అంటూనే కూర్చున్నారు.

'తెలిసింది. అయినా ఎందుకో తెలుసుకుందామనుంది' అలా అడగడం సరదా అనిపించింది.

ఉక్కిరి బిక్కిరి అయ్యారు ఆయన.

'ఏమీలేదు బెజవాడనుంచి ఒక సంబంధం వచ్చింది. మాటాడానికి వెళ్ళాను-' అరుణా పురుషుడు అంతకన్నా ఏమీ చెప్పలేడేమో!

'చెప్పలేకేంలే! అదంతా పరిచయం మీద ఆధారపడి ఉంటుంది. ఆపైన ఏమైందో చెప్పూ-' అన్నది రెండో గొంతు.

తిరిగి ఆరంభించింది రెండో యువతి.

'ఆ రోజు మా యిద్దరిమధ్య చిత్రంగా నడచింది సంభాషణ.

'అయితే నీ నిర్ణయం ఏమిటి రాజూ!' అడిగాను.

'ఏమో ఏమీ చెప్పలేను- ఒక అందాల బొమ్మను మాత్రం చూశాను అంతకన్న మరేమి చెప్పలేను' తెంచినట్లు సమాధానం చెప్పారు. నాకు మాత్రం నవ్వు ఆగలేదు.

"మగవాడవు నీవే అట్లా అంటే... ఏమన్నానోగాని తలచుకుంటే యిప్పటికి సిగ్గుగానే ఉంటుంది.

"కాదు సరూ- గుడ్డిగా ఒక జీవిత సమస్యను చూడడం, పరిష్కరించడం తప్పుకదూ! నేనెవరినో నా స్వభావం ఎటువంటిదో తెలియని ఆమె నాకు భార్యగా పెద్దలు నిర్ణయించిన ఒక సుముహూర్తంలో మారడం నాకు గిట్టదు." ఎంతో ఉద్వేగంతో అన్నారు ఆ మాటలు.

"అయితే ఒకరినొకరు అర్థం చేసుకున్న తరువాత వివాహం చేసుకోవడం మంచిదని యిన్నాళ్ళ తర్వాత అర్థం చేసుకున్నావా రాజూ!" చాలా హేళనగా అన్నాను.

"తెలియక కాదు. కాని మన సమాజం అందుకు సమ్మతించదు." అన్నారు. ఆయన మాటలు పూర్తిగా గుర్తులేవు. కాని ప్రేమించి వివాహం చేసుకోవడం మంచిదని ఆయన అభిప్రాయంకూడా అదే. అందుకే ఆయన వాదాన్ని బలపరచాను.

"ఒకరినొకరు అర్థంచేసుకున్నాం. మరి మన వివాహానికి అడ్డు ఏముంటుంది?" అన్నారు సూటిగా నా కళ్ళలోకి చూస్తూ.

ఆ చూపుల తూపులకు తట్టుకోనలేక పోయాను. అప్పటి ఇరవైఏళ్ళ వయస్సులో ఆ క్షణం ఎంత చురుకైనదో! మనస్సంతా కోలాహలమైంది. నిర్జీవమైన ప్రతి వస్తువ సజీవమై నన్ను అభినందించినట్లుయింది. మనస్సు - శరీరం ఏదో నూతన శోభను నింపుకున్నట్లయింది అక్కడ ఉండలేకపోయాను. ఆ మర్నాడు ఆయనను చూడడానికే సిగ్గు అనిపించింది. రెండు రోజులు తరువాత ఆయనే పలకరించారు.

"సరూ! మొన్న చూచివచ్చిన సంబంధం రద్దు అయింది" అన్నారు నవ్వుతూ-

"అవుతుందని తెలుసు. నా మీద అభిమానం అటువంటిది కదూ!" అన్నాను.

రెండుక్షణాలు గంభీరత వహించారు.

"ధైర్యంగా ఉంటానని, నేను చెప్పినట్లు వింటానని మాట యిస్తే నీకు ఒక విషయం చెపుతాను."

ఏదో వెంటాడుతున్నట్లనిపించింది ఒక్కసారి.

"చెప్పండి. మీరు చెప్పినట్లే వింటాను. ప్రమాణం చెయ్యనా!" అన్నాను నవ్వుతూ!

"అంత స్థయిర్యంతో ఉంటే నాకూ ధైర్యమే! మరేంలేదు. మా పెద్దవాళ్లు ఎవ్వరూ మన వివాహానికి సమ్మతించడంలేదు.

మరింకేదో అన్నారు. వినిపించలేదు. సర్వస్వం నన్ను కేంద్రంగా చేసుకుని పరిభ్రమిస్తున్నట్లనిపించింది. కాని, ఆ బాధ, ఆవేదన తాత్కాలికమే!

"పరీక్షలయిపోయయి. శెలవల్లో యిద్దరము హైద్రాబాదు వెళ్ళిపోదాం. ఉద్యోగం చూసుకుందాం- వివాహం చేసుకుందాం" అన్నారు.

"ఆ మాటలు వినగానే రంగులరాటంమీద తిరిగినట్లనిపించింది. ఉయ్యాల ఊగినట్లనిపించింది."

"ఆ వేసవిలో పరీక్షలవగానే హైద్రాబాదుకు వచ్చేశాం. అదృష్టం ఆహ్వానించింది. పదిరోజుల్లోపుగానే ఉద్యోగం దొరికింది. నా అంత అదృష్టవంతురాలు ఎవ్వరు లేరనుకున్నా." అయినా మనస్సు ఎందుకో భయాన్ని శంకిస్తునే ఉన్నది ఒక ఆదివారం నేను ఆయన సరదాగా మాట్లాడుకుంటున్నాం. అంతలోనే తలుపు మోగింది తీయగానే మామగారు కనిపించారు. భయం నన్ను వణికించింది. నోట మాటరాలేదు నాకు. ఆయనంతట ఆయనే లోనికి వచ్చారు-"

రిక్షా ఆగింది.

రిక్షాలో ఆ యువతికూడా ఆగిపోయింది.

పేజీలు చినిగిపోయిన నవలలో పతాక సన్నివేశం దగ్గర ఆగిపోయిన కథలాగా అనిపించింది వింటున్న యువతికి- రిక్షావాలాకు.

చలిగాని తగలకుండా కట్టిన పరదా తొలగించాడు రిక్షావాలా!

దిగుతూనే పదణాలు చేతిలో పెట్టింది.

"గుడ్ నైట్ సరూ! మళ్ళీ రేపు కలుసుకుందాం. ఏమైనా అదృష్టవంతురాలవు. ప్రేమించిన ఆయన భర్త అయ్యారు. అంతకన్న ఆడది కోరుకునేది ఏముంటుంది?"తనకు అంతటి అదృష్టంలేకపోయింది కదా అన్న ఆవేదన స్ఫురించింది ఆమె స్వరంలో!

రిక్షా కదలి వెళ్ళిపోయింది.

విన్న కథంతా నెమరు వేసుకుంటూ "ఆపైన ఏం జరిగి వుంటుంది? అన్న ప్రశ్నతో ఆలోచనలో పడ్డాడు రిక్షావాలా.

అందమైన గతాన్ని తలచుకుంటూ ఆనందిస్తున్నది రిక్షాలో యువతి. సన్నటి రోడ్డు మీద జారుకుంటూ ఎగబ్రాకి పోతున్నది రిక్షా.

రిక్షా ఆగిపోయింది.

'ఆపేశావేం' అన్నది లోపలనుంచి యువతి

'అంత ఎత్తు ఎక్కించలేను అమ్మగారూ!' రొప్పుకుంటూ అన్నాడు రిక్షావాలా.

నవ్వుకుంటూ, వెళ్ళిపోయింది యువతి.

నీరసంగా రిక్షాలో కూర్చున్నాడుపోతున్న యువతివంకనే చూస్తూ! వెన్నుమీద ఎవరో బలంగా పొడిచినట్లయింది.

మరింత నీరసంగా వాలిపోయాడు రిక్షాలో

◆ ◆ ◆

'సినిమాకు పోయి ఈయనగారు, యింకా తిరిగి రాలేదల్లేవుంది.' పైకి అనుకుంటునే తలుపు తీసింది.

అలసటతో బరువుగావుంది శరీరమంతా బడలికతో ప్రక్కమీద వాలిపోయింది.

కలతనిద్ర — కలత నిద్ర.

తలుపు మోగింది.

తృళ్ళిపడి లేచింది. మత్తుగా లేచి తలుపు తీసింది.

'సినిమాకు పోయారేం?' అన్నది అరమూత కళ్ళను పూర్తిగా తెరవకుండానే,

'ఊఁ!' అంటునే లోపలకు వెళ్ళిపోయాడు సరస్వతి భర్త.

ఆ రోజు ఏడున్నరకు సూర్యోదయమైంది సరస్వతికి.

'సరస్వతీ మీ ఊరు పోవాలనుకుంటున్నావు కదూ! ఇవ్వాళే వెళ్ళు. మంచిరోజు. కాదంటే మళ్ళీ డబ్బు దొరకదు. డబ్బు టేబిలుమీద పెట్టాను. అర్జంటుగా ఆఫీసుకు పోతున్నాను. తాళంచెవి పక్కింట్లో ఇచ్చెయ్యి. ఉత్తరాలు వ్రాస్తూ వుండు' అంటునే వెళ్ళిపోయాడు సరస్వతి భర్త.

* * *

సరస్వతికి ఉత్తరం వచ్చింది. కవరు చాలా పెద్ద ఉత్తరం కావచ్చును. నిండుగా కాగితాలు కవరు పగిలి బయటకు తొంగిచూస్తున్నాయి లోపలి కాగితాలు.

'గర్భిణీస్త్రీ కట్టుకున్న చాలీ చాలని చీరలాగా వుంగి కవరు' నవ్వుకుంటూ అనుకున్నది సరస్వతి.

'ఈ మారు ఏగ విశేషమే వుంది చాలా పెద్ద ఉత్తరం వ్రాశారు' అనుకుంది.

'నా సరూ!'

నీవు. సముద్రపుటుప్పువు. ఆ కట్టుకథ వినడానికి చాలా ఉత్సాహంగా ఉన్నది. విన్నంత సేపు సరస్వతివని ఎట్లా అనుమానించగలను ? ఇక్కడే నీకు నా చిన్ననాటి స్నేహితుడికి సారూప్యత ఉన్నది. తీరని ఆశలు నీలో చాలా ఉన్నాయి. అందుకే అన్నీ జరిగినట్లు అనుభవించినట్లు ఫీలవుతున్నావు. ఒక్కటి గ్రహించాను సరూ ! నీ ఆశయాలు – ఆశలు నేను తెలుసుకున్నాను. ప్రేమించి పెళ్ళి చేసుకోవాలన్న ఆశ తీరలేదు. కాని అంతా జరిగినట్లే చెప్పావు నీ స్నేహితురాలికి.

ఎందుకూ పనికిరాని మనవంటి వాళ్ళకు దురభిమానం ఎక్కువ. రిక్షా తొక్కడం తప్పు కాదని తెలుసు. అయినా ప్రపంచానికి వెరచాను. రాత్రిపూట వెలుగును చూసే ధైర్యాన్ని కోల్పోయాను సరూ ! తెలిసిన వాళ్లు ఎక్కడ కనబడతారో నన్న భయం పాముకన్న ఎక్కువగా పీడించేది. నేను తిరిగే వన్నీ చీకటిసందులు. చేసే నేరాలన్నీ చీకటిలోనే ! నన్ను ఎవ్వరూ గుర్తించకుండా వేషం–భాష, పేరు మార్చినా భయం ఎక్కడికి పోతుంది. అందుకే రిక్షాను ఆంధ్రమహిళా సభ బిల్డింగ్స్ దగ్గరకు రిక్షా తీసుకు రాలేక రాలేకపోయాను. స్ట్రీటులైటు క్రిందకు నీవు వెళ్ళిన తరువాత ఆ వెలుగులో నిన్ను గుర్తించాను. క్షణకాలం మాత్రం ఈ ఉత్తరం చదువుతుంటే నీ వెంత బాధపడ్డావో అంత అనుభవించాను. ఇప్పుడు నాకే బాధాలేదు– నన్ను నమ్ము.

సరూ ! నీవు నా రిక్షా ఎక్కడం అసహజం కాదు కాని కాకతాళీయమే ! నా వంటివాళ్లు ఎందరు హైదరాబాదులో నాలాగానే గుట్టుగా జీవితాన్ని దొర్లించుకుపోతున్నారో!

సరూ ! రిక్షావాడిగా నేను గడుపుతున్న రహస్య జీవితంలో స్నేహితులు ఎందరో లభించారు. వాళ్ళది ప్రశాంతమైన జీవితం. నాకు తెలిసిన రిక్షావాళ్ళు వాళ్ళ భార్యాపిల్లల్ని రిక్షాల్లో ఎక్కించుకుని సినిమాకు పోవడం చూస్తుంటే అవ్యక్తమైన ఆనందం కలుగుతుంది. మల్లయ్య అనే అతను అనేవాడు 'మాషామిలీని యివ్వాళ కారులో (రిక్షాలో) సినిమాకు తీసుకువచ్చాను. నువ్వు కూడా తీసుకురా గంగులూ' అని.

సరస్వతి ! నువ్వు బాధపడుతున్నావా ? ఛీ ! ఛీ ! ! తప్పుకదూ ! మనం చాలా ఆనందంగా ఉండాలి. మనమేమీ రూపాయి ఖర్చుపెట్టి లక్షలు సంపాదించాలన్న ఆశతో ఇతరుల కొంపలు తియ్యడంలేదు. స్వయం శక్తితో బ్రతుకుతున్నాం. ఈ తిండి మనకు జీర్ణమవుతుంది. ఆ తృప్తి మనకు ఉంటుంది. దేముడు మన్ని ఆదరిస్తాడు. మనకు అదే బలం ఎటువంటి హృదయ దౌర్బల్యము ఉండకూడదు ఏ బలహీనత ఉండకపోవడమే బలం

తిరుగు టపాలో నీ నుంచి జాబు రావాలి. ఏమని?– స్వాప్నిక జగత్తులో విహరించడం లేదని, నేలవిడచి సాము చెయ్యడంలేదని తెలుపుతూ వ్రాయాలి. ఈ ఉత్తరం ఎందుకు వ్రాశానో తెలుసా ? నిన్ను బాధించాలని కాదు. యథార్థస్థితి తెలియజెప్పాలని వ్రాశాను. మనమున్న స్థితినిమించి ఆలోచిస్తే భవిష్యత్తు చెడిపోయే ప్రమాదం ఉన్నది. అందుకే నీకు జీవితం గురించిన నిజం చెబుదామని వ్రాశాను.

బాధపడుతున్నావా ? ఎందుకు కన్నీళ్లు ? ఛీ ! ఛీ ! ! కన్నీళ్ళు తుడుచుకుని ధైర్యంగా నిలబడు—

ఎప్పుడూ నీవాడు

రాజు

ఆదోలా మనస్సు నిలచిపోయింది. ఏదో చురుకుమంటు సూది ద్వారా శరీరంలోకి ఎక్కించినట్లయింది. 'నేను అదృష్టవంతురాలిని' అనుకుంది సరస్వతి శ్వాస శ్వాసకు.

## గ్రంథ సమీక్ష

(9 వ పేజి తరువాయి)

ఇందలి పద్యము చక్కని కవిత్వసరళిలో రసజ్ఞుల రంజిల్లజేయుచున్నవి. ఈ గ్రంథముయొక్క తమిళమూలము, తిరుపతినందలి శ్రీ వెంకటేశ్వర, శ్రీ గోవిందరాజస్వామివార్ల ఎదుట ప్రతిగురువారము కీర్తింపబడుటవల్ల, ఈ కావ్య ప్రాముఖ్యము తెలియును.

ఇట్టి ఉత్తమ కావ్యమును రసగుళికవలె తియ్యని తెలుగులో, సుప్రసిద్ధ రచయిత శ్రీమాన్ మాడభూషి గోపాలాచార్యులవారి కలంనుండి వెలువరింపజేయుట చాలా ఉచితముగా నున్నది.

భావసమైక్యతయొక్క అవసరము ఎంతైనా ఉన్న ఈ రోజులలో, అన్యభాషా సాహిత్యమును ఆంధ్రప్రజలకు అందిస్తూ సారస్వతపూజ, సంఘసేవ చేస్తున్న శ్రీ గోదా గ్రంథమాలవారు ఎంతైనా అభినందనీయులు.

—కె. ఆర్. కె. మోహన్.

—

## కోమలి కథ

(6 వ పేజి తరువాయి)

మూడుసార్లు టీ యిచ్చి వెళ్ళింది ఓ విధంగా ఆరోజు పెండ్లి యింటయ్యా నాడే అయిందే. ఆమె నావైపే కండ్లు ఆర్పుతూ నీలికండ్లతో నిండుగా పూలెట్టుకొని కుంకుమతో కన్పించింది.

రాత్రి నాగదిలో నేను తియ్యటి కలలతో నిద్దురపోయ్యాను. కలలో ఆమెను పెండ్లిచేసుకొన్నాను. మేము గోదావరి ఒడ్డున యిసుక తిన్నెలమీద, వెన్నెలరాత్రులు, చెట్టుపట్టాలతో గడుపుతున్నాం. తెల్లగా తెల్లవారింది. కల కరిగింది... నాలో నిస్సత్తువ. ఆరోజు నాకు జ్వరం వచ్చింది. నా జ్వరం విషయం సత్యానికి, ఆ తర్వాత ఆమెకు తెలిసి ఉంటుంది. ఆమె నాయింటికి సంధ్యవేళ వచ్చింది ఒంటరిగా.

నాకు భయం. ప్రజలేమనుకొంటారోనని అది అడిగాను నేను.

పలకలేదు ఆమె. చివరగాఅంది 'యింకా నన్ను అర్థం చేసుకోలేదా?' అని ఏమని అర్థం చేసుకోను. ఆమె యంత్రం. నా మాటలు పెకలి రాలేదు. రానివ్వలేదు. మా అక్కయ్య కూతురు విజయకుమారి, మనస్సులో– కండ్లముందు నిలబడింది విజయ నవ్వుతూ–

తలవద్దకువేరి నుదురు రాస్తుంది ఆమె. నేను వద్దనలేదు. ఆ స్పర్శానుభూతి బావుంది. కాని మనస్సులో ఏమిటో భయం.

'యిక్కడ మీరు ఒక్కరే ఏం ఉంటారు మా యింటికి వచ్చెయ్యకూడదు?'